
# శీతగాలీ శిశిరమూ....!




స్వప్నరాగలీన

జయంత్‌ని మొదటిసారిగా రైల్లో కలిశాను. హైదరాబాద్ నుండి విజయవాడ వస్తున్నాను. రైలు కదిలిన తొందరలో అతని కూపేలో ఎక్కేశాను. నాన్‌స్టాప్ స్లీపర్‌కోచ్ కావడంతో ఏం చేయాలో తోచ లేదు.

"తొందరలో ఎక్కేశాను. మీ కభ్యంతరం లేకపోతే" పక్కన సీటిమ్మన్నట్టుగా చూశాను. విండో సీటు నాకిచ్చి తను ఇవతలికి జరిగాడు.

'థ్యాంక్స్' చెప్పి అతని పక్కన కూర్చున్నాను. ప్రయాణం చాలా ఆహ్లాదంగా వుంది. చలికాలపు సాయంకాలం గోరువెచ్చని ఎండ. ఒక పక్క అపరిచిత యువకుడు. కిటికీకవతల పచ్చటి పొలాలు. ఉండుండి వీస్తున్న గాలి నా కురుల కుంచెలతో అతని చెంపల కాన్వాసు మీద చిలిపి చిత్రాలేవో గీసి జారుకుంటుంది.

అప్పుడప్పుడు అతని వైపు చూస్తున్నాను. తానేదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు. నన్ను చూస్తూనే చిర్నవ్వేసి పేపర్ చదూతున్నట్టు నటిస్తున్నాడు. అతని నవ్వు...నిర్మలాకాశం మీంచి తేలివచ్చే తెల్లటి మబ్బులా ఆహ్లాదంగా వుంది. ఈసారి నేనే సాహసించి అతన్ని పరికించి చూశాను. మరీ అందగాడు కాదు కానీ నుదుటిమీద పడ్తున్న అతని జుట్టు చాలా అందాన్ని తెచ్చిపెడ్తుందతనికి. తీరైన ముక్కు. గొప్ప ఆకర్షణ అతని ముఖానికి.

అనుకోకుం ఆ ఓ అపరిచిత యువకుడితో ప్రయాణం ఓ వింత అనుభవం.

రైలు విజయవాడ చేరుకునేంత వరకు అతని ఊపిరి పరిమళమేదో నన్నల్లుకుని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అనుభూతి. పరిచయం చేస్కోవాలని మనసు పరుగులు తీస్తున్నా...స్త్రీత్వం తాలూకు సిగ్గేదో కళ్ళెం వేస్తుంది.

తాను కూడా బిడియస్తుడల్లే వున్నాడు. మాట్లాడటానికి మొహమాటపడ్తున్నాడు. అయినా మౌనం ఇంత బావుంటుందని మొదటిసారి అనుభవంలోకొచ్చింది.

విజయవాడలో రైలు ఆగుతూనే అతని ఫ్రెండ్స్ ఎవరో అతనికోసం రావడంతో చివరిలోనయినా పరిచయం చేస్కోవడం కుదరలేదు. వెళ్తూ వెళ్తూ తొలిపరిచయానికి గుర్తుగా చిరునవ్వొకటి పెదాలమీంచి జార్చి వెళ్ళిపోయాడతను.

* * *

రెండోసారి జయంత్‌ని లైబ్రరీలో చూశాను. నా స్నేహితురాలు జ్యోతితో కలిసి లైబ్రరీకెళ్ళినారోజు. పేపర్ చదువుతున్న అతన్ని చూస్తూనే ఆనాటి రైలు ప్రయాణపు పరిమళం నన్ను చుట్టుముట్టింది. పేపర్లోంచి తలెత్తి నన్ను చూశాడు.

"నేను గుర్తున్నానా...?"

నా చూపులు అతన్ని పలకరించాయి.

"మిమ్మల్నెలా మర్చిపోగలను"

అతని కళ్ళు జవాబిస్తూ మెరిశాయి.

అతని పెదవి మీంచి ఓ నవ్వుల తెల్ల పావురాయి ఎగిరొచ్చి నా కళ్ళ కొమ్మల మీద వాలిన అపూర్వానుభూతి.

అలా ఎంతసేపు చూపులు పెనవేసుకుపోయాయో....' ఇక్కడ కూడా భాష అవసరం లేకపోయింది.

నా స్నేహితురాలు జ్యోతి నా కళ్ళ ముందు చిటికెలు వేస్తూ "ఏమిటే కళ్ళు తెరిచే నిద్రపోతున్నావా...?పద..." అంటూ నన్ను బయటకు తీస్కొచ్చేసింది.

లైబ్రరీ మెట్లు దిగుతూ వెనక్కి చూశాను. మా వెనకే దిగుతూ జయంత్...' అతనలా వెంటే వస్తూంటే తనూ నేను అపరిచితులం అన్పించటం లేదు. ఎంతో దగ్గరివాడిలా అన్పిస్తుంది.

* * *

లైబ్రరీ సంఘటన తర్వాత జయంత్ చాలా రోజులుగా కన్పించలేదు. విజయవాడ నగరంలో అతని కోసం నేను వెతకని ప్రదేశమేలేదు.

ఒక యువకుడు 'ఓ యువతి మనోమందిరద్వారాలు తెరిచి....లోపలికి రాకుండా వెళ్ళిపోతే...ఎంతనరకం...' అతని రాకకోసం మనస్సు పరితపిస్తుంది అతన్నెందుకో మరువలేకపోతున్నాను. జయంత్ పరిచయానికి ముందు చాలామంది నన్ను ప్రేమిస్తున్నానని నా చుట్టూ తిరిగారు. కానీ ప్రేమ...పెళ్ళి గురించి ఆలోచించే స్థితి కాదు నాది. పైగా నా వెంట పడిన వాళ్ళవరూ నా మనస్సుకు నచ్చలేదు. కాని జయంత్ ..జయంత్ చిరునవ్వు. అతని అమాయకమైన ముఖం లోలోపలికి దూసుకుపోయే

చూపులు. నన్ను కనీసం పలకరించలేపోయిన అతని బిడియం ఇవన్నీ నాకు నచ్చాయి.

అపరిచిత ప్రపంచంలో అపరిచిత మనుషుల మధ్య ఒకానొక యువకుడి చిన్న చిరునవ్వు చిరపరిచితమయినట్టు కన్పించాయి. అందుకే జయంత్ నా మనసంతా నిండిపోయేడు. అతను లైబ్రరీలో కన్పిస్తాడని ప్రతిరోజు వెళ్ళి గంటలు గంటలు అతనికోసం ఎదురుచూసేదాన్ని కానీ...నా అన్వేషణ నిరీక్షణ వ్యర్థమయిపోయాయి. చాలాసార్లు అనుకుంటాను. నాకులాగే జయంత్ కూడా నన్నన్వేషిస్తుంటాడా...? తనూ నా గురించి ఇలాగే ఆలోచిస్తుంటాడా...? లేక ఆ చిరునవ్వు ఆ కళ్ళు మెరుపు అంతా ఓ కలగా ... మారిపోతుందా...? ఇలా రోజులు వారాలై నెలలుగా మారిపోయాయి. తానొక వసంత కోకిలల్లే వచ్చి వెళ్ళిపోయాడు. అతని జ్ఞాపకాల మీద కూడా పొరలు కమ్ముకుని తన రూపం అస్పష్టమయిపోయింది. రొటీన్ జీవితంలో పడి నేనూ తనని తాత్కాలికంగా మరిచిపోయాను.

* * *

**హ**ఠాత్తుగా ఓ రోజు జయంత్ కన్పించాడు. ఆరోజు ఓ పత్రికలో ఉద్యోగం కోసం వెళ్ళాను.

"మీరా" అని వినిపించిన వైపు చూసి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. అతన్నింత చేరువలో చూసి నా కాళ్ళలో సన్నని వణుకు...తెలీని గిలిగింతేదో కలుగుతుంది. "మీరు...ఇక్కడా..? నన్ను నేను కంట్రోల్ చేస్కుంటూ అడిగా....?

"నా పేరు జయంత్...నేనిక్కడ సబ్ ఎడిటర్‌గా జాబ్ చేస్తున్నాను" తను పరిచయం చేస్కున్నాడు.


"నా పేరు 'స్వప్న' నేను చాలా కాలంగా మీ పత్రికకు ఫ్రీలాన్స్‌గా బొమ్మలు వేస్తున్నాను. మీ ఎడిటర్‌గారు నన్ను ఇక్కడ జాబ్ చేయమని లెటర్ పంపారు. అందుకే వచ్చా..." ఆ తర్వాత కొద్దిసేపు మవునం.

"ఓ...అయితే....మా ఆఫీస్‌లో అందరికీ మీరు తెలుసు...పర్సనల్‌గా పరిచయం చేస్తాను రండి...."

"థ్యాంక్సండీ.."అంటూ అతన్ని అనుసరించాను.

* * *

**రో**జులు చాలా వేగంగా గడుస్తున్నాయి. ఆఫీసులో రోజూ కలుసుకోవడం వల్ల మా మధ్య స్నేహం దినదిన ప్రవర్ధమానమయి మంచి స్నేహితులమయ్యాం. ఒకర్నొకరం ప్రేమించుకుంటున్నా బయటపడలేదు. తనిప్పుడు మా ఇంటికి కూడా వస్తున్నాడు. అమ్మతో తనకు చనువు పెరిగింది. అమ్మా నేనే వుంటాం ఇంట్లో అయినా...మాకు వేరే ఏదీ ఆధారం లేకపోవడం వల్ల హాబీగా నేర్చుకున్న పెయింటింగ్‌నే జాబ్‌గా చేయాల్సొస్తుంది. పేదరికానికి రోగం బంధువు కదా! అమ్మని క్షయ అంటిపెట్టుకుంది. రోగం తగ్గించలేకపోయినా కనీసం అమ్మకు తిండిపెట్టగలిగినా చాలనుకున్నాను.



**ఒకవైపు శీలం మరోవైపు అమ్మ ఆ రెంటికి మధ్య జీవితంలో ....జయంత్...! ఏదేమయినా అమ్మరుణం తీర్చలేనిది. చూస్తూ చూస్తూ అమ్మని చంపుకోలేను... అందుకే శీలం పణంగా పెట్టడానికే నిర్ణయించుకున్నాను.**

కాని....అమ్మనెలాగయినా బతికించుకోవాలని ఉంది.

అమ్మకు వ్యాధి తీవ్రమయినప్పుడల్లా ఆఫీసుకి సెలవుపెట్టి అమ్మకు తోడుగా ఇంట్లోనే ఉండిపోతున్నాను. అలాంటపుడు జయంత్‌ని కలవడం కుదరట్లేదు. ఓ రోజు ఆఫీసుకు వెళ్ళని సాయంత్రం జయంత్ ఇంటికొచ్చాడు. తనే బయటపడ్డాడు.

"స్వప్నా నేను నిన్ను చూడకుండా ఒక్కరోజు కాదు... ఒక్క క్షణం కూడా ఉండలేను నువ్వు ఆఫీసుకు సెలవు పెట్టకు లేదా...నేనూ నీతోపాటే సెలవు పెట్టి నీతోనే వుండిపోతా..."

మౌనంగా అతని వైపు చూశాను.

'అమ్మకు క్షయ అని జయ్‌తో ఎలా చెప్పాలి. చెప్తే అమ్మతో చనువుగా ఉండగలడా మా ఇంటికే రావడం మానేస్తాడా...?' ఏదీ తేల్చుకోలేకపోతున్నాను. నా కళ్ళలో నీళ్ళు చూసి తను చలించిపోయాడు. నన్ను తన వొడిలోకి తీసుకున్నాడు. మొదటిసారి అతని కౌగిలిస్పర్శ....అమ్మవొడి విడిచాక మళ్లీ అంత వెచ్చటి భద్రత...నమ్మకం కల్గిస్తున్న జయంత్.

* * *

**అ**మ్మని హటాత్తుగా హాస్పిటల్‌లో చేర్పించవలసొచ్చింది. ఓ వారం రోజులు ఆఫీసుకు సెలవ్‌పెట్టాను. మూడోరోజనుకుంటా జయంత్‌కు ఫోన్ చేశాను. డబ్బులు చాలా అవసరం తనని అడుగుదామని ఎందుకో అడగలేక సాయంత్రం కలుస్తానని చెప్పి ఫోన్ పెట్టేశాను.

సాయంత్రం జయ్‌ని కలవలేదు. నా కోసం చూసి చూసి విసిగిపోయివుంటాడు. నా స్నేహితురాలు జ్యోతిని కలిసి సహాయం చేయమన్నాను. ఉన్నపళంగా అంత డబ్బు తన దగ్గరలేదన్నది. కాని తనకు తెలిసిన ఓ హోటల్ ఓనర్‌ని పరిచయం చేసింది.

ప్రయత్నిస్తాను రేపు రమ్మని పంపేశాడతను. రెండవరోజు అతని దగ్గరకెళ్ళాను. హోటల్ ఓనరు చేసిన ప్రతిపాదన విని షాక్ తిన్నాను నేను. అతని మీద కోపం అసహ్యం కలిగాయి. వెనక్కి తిరిగి రెండడుగులు వేసి ఆగిపోయాను. 'ఎవరు మాత్రం ఊరికే డబ్బులు ఎందుకిస్తారు. అప్పుగా ఇవ్వాల్సొచ్చినా ఏం చూసి ఇస్తారు. తిరిగి తీర్చేందుకు తన దగ్గర ఏముందని....

ఒకవైపు శీలం మరోవైపు అమ్మ ఆ రెంటికి మధ్య జీవితంలో .... జయంత్...! ఏదేమయినా అమ్మరుణం తీర్చలేనిది. చూస్తూ చూస్తూ అమ్మని చంపుకోలేను...అందుకే శీలం పణంగా పెట్టడానికే నిర్ణయించుకున్నాను.

అతని వైపు తిరిగి 'సరే' అన్నాను. 'నా ఫ్రెండ్‌కి కబురు చేస్తాను సాయంత్రం రండి' అన్నాడతను నవ్వుతూ...'

మౌనంగా అక్కణ్ణుంచి వచ్చేశాను. ప్రతిసంబంధం రూపాయి దగ్గరే ముడిపడ్తుందని తొలిసారి నేర్చుకున్నాను.

* * *

"**రం**ద్రండి. మీకోసమే ఎదురు చూస్తున్నాను. మేడమీద 28నెంబరు రూమ్‌లో నే చెప్పిన వ్యక్తి వున్నాడు వెళ్ళండి"చెప్పాడు హోటల్ ఓనర్...అతని ముఖం వైపు చూడకుండా మెట్ల వైపు నడిచాను. ఒక వింత పరిస్థితిలోకి జారిపోతున్నాను. మెట్లెక్కుతూ ఓసారి కళ్ళు మూస్కున్నాను. 'జయంత్ అయ్యాం సారీ జయంత్' జయంత్ రూపం మనస్సులో మెదిలింది. అతని చిరునవ్వు గుర్తొచ్చింది.

నేనిలా చేస్తున్నానని తనకు తెలిస్తే....పంచప్రాణాలు నా మీదే పెట్టుకున్న జయంత్ తట్టుకోగలడా.... అమ్మను బతికించుకోబోయి...జయంత్‌ని చంపుకుంటున్నాన్నా...!

28 రూమ్ నెంబర్ ముందు నిలబడ్డాను. వణుకుతున్న చేతిని కాలింగ్‌బెల్ దాకా తీస్కెళ్ళటం కష్టమయిపోయింది. కాలింగ్‌బెల్ నొక్కాను. గుండె వేగంగా కొట్టుకుంటుంది. తలుపు మెల్లగా తెరుచుకుంది. నేల వైపు చూస్తున్న నేను సిగ్గుతో కుంచించుకుపోతు ఎదురుగా వున్న వ్యక్తివైపు చూశాను. అంతే...జీవితంలో ఎప్పుడూ ఎరగనంత పెద్దషాక్‌కి గురయ్యాను.

ఎదురుగా వున్న వ్యక్తి జయంత్.